విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా

జగనన్న సురక్షపై అధికారులకు అవగాహన ఉండాలి: కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై జిల్లా, మండల, గ్రామస్థాయి వరకు అధికా రులందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. జగనన్న సురక్ష పై జిల్లా, మండల స్థాయి అధికారులకు వెబ్ఎక్స్ సమావేశం ద్వారా కలెక్టర్ ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామాలకు, వార్డులకు వెళ్ళినపుడు చేయవలసినవి, చేయకూడనివి వివరించారు. ఈనెల 23న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తున్నారన్నారు. ఈనెల 24న వాలంటీర్లు గ్రామ వార్డు సెక్రటేరియట్ సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజలలోజగనన్న సురక్ష పై అవగాహన కల్పించి వారి సమస్యలు తెలుసు కోవాలన్నారు. మండలానికి రెండు టీంలు ఏర్పాటు చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లాలన్నారు. అందుగ్గాను జూలై 1నుండి నెలరోజులపాటు ఏ తేదీన ఏ గ్రామాలకు వెళ్తారో షెడ్యూల్ రూపొం దించు కోవాలన్నారు. మండల టీములు గ్రామానికి వెళ్లే తేదీని గ్రామాల్లో అందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. వాలంటీర్లకు, సెక్రటేరియట్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు.గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి వారితో స్నేహపూర్వకంగా వుండి, వారు అడిగే వాటికి ఓర్పుగా సమాధానాలు ఇవ్వాలన్నారు. వారి సమస్యలు తెలుసుకుని మండల టీంలు గ్రామానికి వచ్చినరోజున అవసరమైన సర్టిఫికేట్ లు అక్కడే అందజేయాలన్నారు. మే 9 నుండి జరుగుతున్న జగనన్నకు చెబుదాం లో పరిష్కారమైన సమస్యలను అర్జీదారులకు వివరించాలనీ కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని క్షేత్ర స్థాయి లోనే పరిష్కరించే ముఖ్య కార్యక్రమం అయినందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పని చేయాలన్నారు. ఈ వెబ్ఎక్స్ సమావేశంలో పీడీ డిఆర్డిఏ సాంబశివారెడ్డి, జడ్పీ సీఈఓ చిరంజీవి, పిడి డ్వామా వెంకట్రావు, డిపిఓ సుస్మితా రెడ్డి, ఆర్డీవోలు ,జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించండి: ఫ్యాప్టో

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం నిమిత్తం జూన్ 5వ తేదీ నుండి సెప్టెంబర్ ఒకటో తేదీ వరకు వివిధ దశల పోరాట కార్యక్రమాలు పిలుపులో భాగంగా 2 దశ కార్యాచరణలో 8 డిమాండ్లతో రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాని గోవర్ధనరెడ్డికి ఫ్యాప్టో ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి కి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కి కూడా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సెక్రటరీ జనరల్ ఎ.సురేంద్ర రెడ్డి, చిట్టేటి రమేష్ మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా బాధ్యులు వి.వి.శేషులు,సి.హెచ్. హజరత్, సి.హెచ్.చలపతి, చలపతి శర్మ, దశయ్య, పిచ్చి బాబు, వేణుగోపాల్, ప్రసాద్, నాగిరెడ్డి, రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

గిరిజన బతుకులు బూడిద పాలు

విశాలాంధ్ర-ముత్తుకూరు: దేవర దిబ్బ గిరిజన కాలనీ వాసుల బతుకులు ఏపీ జెన్కో బూడిద చెరువు పాలు అయిందని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం నాయకులు చినపించలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ బూడిద చెరువును దేవరదిబ్బ గిరిజన కాలనీ పక్కన ఏర్పాటు చేయడం వల్ల గాలివీచినప్పుడల్లా బూడిద ఎగిరి కాలనీ పై పడుతుందన్నారు. అలాగే తినే ఆహారంలోనూ, తాగే నీటిలో బూడిద కలుషితమై వాటిని తాగిన గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఊపిరితిత్తుల వ్యాధుతో సుమారు పదిమంది యానాదులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని పర్యాయాలు తమ సమస్యను జంకు అధికారులకు యానాదులు వివరించిన స్థానిక నాయకుల అండ చూసుకొని అధికారులు యానాదులు పట్టించు కోకపోవడం విచారక రమన్నారు. బూడిద పాలుతున్న గిరిజ నులను ఇప్పటికైనా సురక్షిత ప్రాంతానికి తరలించి వారి జీవన ప్రమాణాలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. గిరిజన సమస్యలను పట్టించుకోకపోతే తాము ప్రత్యక్ష ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు చెంబేటి ఉష, ఆర్గనైజింగ్ సెక్రట రీ పుత్తూరు శ్రీనివాసరావు, మాణికల మురళి పాల్గొన్నారు.

22 నుంచి ఆచార్య అకాడమీలో తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్: గ్రూప్ -1, గ్రూప్-2 ఆఫీసర్స్ కావాలని కలలు కనేవారి కలలు నిజం చేసేందుకు ఆచార్య అకాడమీ సిద్ధమైంది. ఈనెల 22 నుంచి ఆచార్య అకాడమీ ఆధ్వర్యంలో గ్రూప్ -1, గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని సంస్థ డైరెక్టర్ మోహన్ తెలిపారు. ఆదివారం నెల్లూరులోని డిఆర్ ఉత్తమ్ హెటల్లో రెండోసారి డెమో తరగతులు నిర్వహించారు. ఈ తరగతులకు అధిక సంఖ్యలో గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల హాజరయ్యారు. అనంతరం మోహన్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాదులో ఎన్నో సంవత్సరాలుగా ఆచార్య అకాడమీ గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి వారి కలలను సాకారం చేసిందన్నారు. అనేకమంది కోరిక మేరకు నెల్లూరులో ఆచార్య అకాడమీ బ్రాంచ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గౌరవ డైరెక్టర్ ఓబులేసు నందన్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి వచ్చే అధ్యాపకులచే నెల్లూరులో తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు నెల్లూరు నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యా లయం ఎదురుగా ఆచార్య అకాడమీ బ్రాంచ్ ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జేఈఈ ఫలితాలలో విశ్వసాయి విద్యార్థుల ప్రతిభ

-జాతీయ స్థాయిలో ర్యాంకులు కైవసం

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: 2023 జేఈఈ అడ్వాన్సుడ్ ఫలితాలలో విశ్వ సాయి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు, ఆ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. జాతీయ స్థాయిలో తమ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. పి.హృతిక్ 112వ, వి.యజ్ఞశ్రీ 892వ, ఆర్.ప్రశాంత్ 1931వ, పి.తనుశ్రీ 3315వ, ఎన్.సిసిర్ రెడ్డి 3508వ, టి.యువదీప్ 1521వ ర్యాంకులను జాతీయ స్థాయిలో సాధించారని తెలిపారు. విద్యార్థుల నిరంతర కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ ర్యాంకుల సాధనకు సాధ్యమైందని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను అభినందించినట్లు తెలిపారు. తాము రూపొందించి అవలంబిస్తున్న స్కెచ్ ఫ్రీ ఎడ్యుకేషన్, ఐదు స్టెప్ ప్రోగ్రాం ద్వారా ఎంపీసీలో కూడా మంచి ఫలితాలను సాధిం చినట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల సైతం మంచి ఫలితాలు సాధిస్తున్నారని వైస్ చైర్మన్ కృష్ణమోహన్ తెలిపారు. జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యా ర్థులను, అధ్యాపకులను, అధ్యాపకేత రులను అభినందించినట్లు తెలిపారు. ఈ విజయ పరంపర భవిష్యత్తులో కూడా తదితర పోటీ పరీక్షలలో తమ విద్యార్థులు మంచి ఫలితాలు రాణిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అందుకు తగ్గట్టు అధ్యాపకుల, తల్లిదండ్రులచే ప్రోత్సా హం ఉంటుందని తెలిపారు. విశ్వ సాయి సంస్థల ప్రిన్సిపాల్ లు, అధ్యాపకులు, అధ్యా పకేతరులు తల్లిదండ్రులకు అభినందనలు తెలిపినట్లు తెలిపారు.

సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నిస్తే కొట్టి పెట్రోల్ పోసి చంపేస్తారా?: జనసేన

విశాలాంధ్ర - కావలి: సోదరిని వేధిస్తున్నారని ప్రశ్నిస్తే కొట్టి, పెట్రోల్ పోసి చిన్న బాలుడిని చంపేస్తారా? అని జనసేన పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ నయీమ్ ఆదివారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బాపట్ల లో జరిగిన సంఘటన ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ బాధాకరమైన సంఘటన అన్నారు. తన అక్కని వేధింపులకు గురి చేస్తున్నారని అడ్డుకున్న అమర్ నాథ్ ను స్థానిక వైఎస్సార్ సీపీ నేత కట్టేసి పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. పోలీసులు నిందితులకు వత్తాసు పలకటం తో నిందితులు యాదేచ్చగా తిరుగుతున్నారన్నారు. ఇది దుర్మార్గం మైన చర్యని, మానవత్వం మంట గలిసిందని, దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని, అమర్ నాథ్ కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేశాడు.

మహిళపై వైసిపి నేత పైశాచిక దాడి

- అవమానం తట్టుకోలేక మహిళ ఆత్మహత్యా యత్నం
- హాస్పిటల్ కు తరలించడంతో తప్పిన ప్రమాదం
- గతంలోనూ ఈ నేత పై అనేక ఆరోపణలు

విశాలాంధ్ర - కావలి : పట్టణంలోని ఒక మహిళపై వైసీపీ చోటా నాయుకుడు పైశాచికంగా దాడి చేసిన సంఘటన కలకలం రేపింది. పట్టణానికి చెందిన కరకమిట్ల పార్వతి ఒక ప్రొవిజన్స్ షాపు నిర్వహిస్తుంది. షాపు కోసం వైసీపీ చోట నేత దర్శిగుంట మహేంద్ర దగ్గర డబ్బులు అప్పుగా తీసుకున్నది. అప్పు తీసుకున్న డబ్బులు వడ్డీతో సహా చెల్లించినా రూ.20 వడ్డీ చెల్లించాలంటూ శనివారం రాత్రి ఏడు మంది షాపు పై దాడి చేశారు. పూర్తిగా మద్యం సేవించి మహిళ పై, ఆమె కొడుకు పై పైశాచికంగా దాడి చేశారు. మహిళ అని కూడా చూడకుండా బట్టలు ఊడేలా దాడి చేయడంతో అవమానానికి గురైన మహిళ పోలీస్ స్టేషన్ ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. వెంటనే ఒక ప్రయివేటు హస్పటల్ కు ఆమెను తరలించి చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పింది. నన్ను ఎవరూ ఏమి చేయలేరూ పోలీసులు కూడా మేము చెప్పినట్లే వింటారు నీకు దిక్కున్న చోట చెప్పుకోమని మహేంద్ర చితక బాదినట్లు బాధితురాలు మీడియా ముందు బోరున విలపించింది. మహేంద్ర పై గతంలోనూ పలు ఆరోపణలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్ కు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాన్ని కూడా ఆక్రమించుకొని షాపులు ఏర్పాటు చేసి అద్దెకు ఇస్తున్నాడని, కొన్ని కొన్ని సెటిల్ మెంట్లు సైతం పోలీస్ స్టేషన్ వద్దనే చేస్తుంటాడని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో పట్టణంలోకి వచ్చే వాహనాలు, షాపులు ఏర్పాటు చేసుకున్న వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో వసూలు చేసి, రసీదులు ఇవ్వకుండా స్వాహా చేశారన్న అభియోగాలు కూడా ఉన్నాయి. ఎమ్మెల్యే కు ముఖ్య అనుచరుడిగా, పెద్ద పెద్ద ఫ్లెక్సిలు ఏర్పాటు చేస్తూ అందరి వద్ద బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మమ్మ బండ్ల పొంగళ్లు

విశాలాంధ్ర -ఉదయగిరి: మండల పరిధిలోని చౌటపల్లి గ్రామంలో వెలసిన మహాశమ్మ అమ్మ వారి తిరుణాల ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో బండ్ల పొంగళ్లు అమ్మవారి భక్తులు నిర్వహించారు. ఎడ్లబండ్లను ప్రత్యే కంగా అలంకరించి దేవస్థానం వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బా రెడ్డి కార్యక్రమంలో పాల్గొని మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి దయ ఉంటే ఏ స్థాయికైనా ఎదగ వచ్చన్నారు. నియోజకవర్గ ప్రజలు అష్ట ఐశ్వర్యాలతోసుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరాలన్నారు. తిరునాళ్ల పాల్గొన్న ప్రతి భక్తుడి నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మాజీ ఎంపీటీసీ ఉప్పుటూరి హరి పాల్గొన్నారు.

ఎస్‌బిఐ అధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కావలి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దివంగత నాయకులు వై.తారకనాథ్ 19వ వర్ధంతిని పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆదివారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యస్ బిఐ మెయిన్ బ్రాంచ్ నందు నిర్వహించిన ఈ శిబిరాన్ని చీఫ్ మేనేజర్ దీపక్, కావలి రెడ్ క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్, జిల్లా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ దామిశెట్టి సుధీర్ నాయుడు లు ప్రారంభించారు. ఈ శిబిరంలో పట్టణంలోని మూడు ఎస్ బిఐ బ్రాంచ్ ల ఉద్యోగులతో పాటు, భారీ సంఖ్యలో వినియోగదారులు మొత్తం 121 మంది రక్తదానం చేసారు. ఈ శిబిరాన్ని ఎస్బిఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, యూనియన్ లీడర్లు కెవియస్ యన్ మూర్తి, ప్రసాద్, సనత్ కుమార్, గిరిధర్ లు సందర్శించి రక్తదానం చేసిన ఉద్యోగులను, వినియోగదారులను అభినందించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 19 వర్ధంతికి కూడా వందలాది మంది రక్తదానం చేయడం చూస్తుంటే తారకనాథ్ ఉద్యోగుల గుండెలలో అమరుడిగా నిలిచి పోయినట్లు అర్ధమౌతుందన్నారు. వినియోగదారులు కూడా అధిక సంఖ్యలో రక్తదానం చేయడం, సిబ్బంది అందిస్తున్న సేవలు, ప్రజా సంభందాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మరింత సేవలందించి బ్యాంక్ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులతో పాటు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి వెంకటనారాయణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి శ్రీనివాసరెడ్డి ఇతర ఉద్యోగులు జీవన్, ప్రసన్న, సుమన, భువనేశ్వరి, శ్రీనివాసులు పాల్గొన్నారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు కె హరినారపరెడ్డి, కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, జమున, టీం సేవియర్స్ కీర్తి బృందం పాల్గొన్నారు.

బీద రవిచంద్రను పరామర్శించిన టిడిపి నాయకులు

విశాలాంధ్ర -వరికుంటపాడు: యువగళం పాదయాత్ర లో పాల్గొని కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ను నెల్లూరులోని తన నివాసంలో పరామర్శించన వరికుంటపాడు మండల టిడిపి కన్వీనర్ చంద్ర మధుసూదన్ రావు, తెలుగు యువత అధ్యక్షులు ముజ్జీ లక్ష్మీ నారాయణ, పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, పోక మహేష్, దుత్తలూరు మాజీ ఎంపీపీ రవీంద్రబాబు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ బీద రవిచంద్ర త్వరగా కోలుకొని పాదయాత్రలో పాల్గొనాలని కోరుకుంటున్నట్లు వారి తెలిపారు.

చంద్రబాబు ను కలసిన పసుపులేటి దంపతులు

విశాలాంధ్ర - కావలి : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ దంపతులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి, బొకే అందజేశారు. లోకేష్ పాదయాత్ర ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో జరుగుతున్న నేపథ్యంలో పసుపులేటి దంపతులు చంద్రబాబు ను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలతో పసుపులేటి నియోజకవర్గంలో దూసుకువెళ్తున్నాడు. పేదల పెళ్లిళ్లకు తాలిబోట్లు, గ్రామాల్లో బోర్లు, వీధి దీపాలు, బడులు, గుడులకు సహాయాలు చేస్తూ నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. పార్టీలకతీతంగా, ఇబ్బందులు, కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఆయన సతీమణి సుగుణమ్మ సహకారంతో ట్రస్ట్ ను ప్రారంబించిన పసుపులేటి చేస్తున్న సహాయాలు అనేకం. వైద్యానికి సహాయం, ఉచిత అంబులెన్స్, విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు, ఇలా అనేకం చేస్తూ నియోజకవర్గంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ను పసుపులేటి దంపతులు కలవడంతో కావలి నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ కి సిద్దంగా ఉన్నాడన్న సంకేతాలు ఆయన అనుచరులకు పంపుతున్నాడు. ఇప్పటికే అనేకమంది తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయనను కలసి మద్దతు తెలుపుతుండటం విశేషం. ఎలాంటి పదవులు లేకుండా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న పసుపులేటి సుధాకర్ ను ఎమ్మెల్యే గా చూడాలన్న కావలి నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక చంద్రబాబు తీరుస్తాడేమో చూడాలి.

ప్రభుత్వ కార్యాలయులు తరలి పోయాయి.. డిగ్రీ కళాశాలను తరలించకుండా చూడాలి

విశాలాంధ్ర-రాపూరు: మండలంలో పలు ప్రభుత్వ కార్యాల యాలు తరలిపోతున్నాయని, డిగ్రీ కళాశాల తరలి పోకుండా చూడాలని రాపూరు పట్టణ స్థానికులైన దామిశెట్టి సురేష్ కోరారు. రాపూరు మండలం అభివృద్ధి చేసేందుకు కృషి చేయా లి కాని రాపూరు లోని ప్రభుత్వ ఎక్సై జ్ సర్కిల్ కార్యా లయం ఇటీవల పక్క మండలానికి తరలివెళ్లిందని, కార్యా లయం రాపూరులో ఎన్నో దశా బ్దాలుగా ఉందని, కార్యాలయం లేనందు వలన చాలామంది అధికారులు పక్క మండలానికి వెళ్లిపోయారన్నారు. త్వరలో ఆ పరిస్థితి రాపూరులోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి వచ్చే స్థితి వచ్చింది. రాబోయే ఆ పరిస్థితిని మండల ప్రజా నాయకులు, సంఘాల అధ్య క్షులు గమనించి డిగ్రీ కాలేజికి గల సమస్యలను పరిశీలించి అభివృద్ధి పనుల మీద మనస్సు పెట్టాలని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాపూ రులో గల మురుగు కాలువలు, దహన సంస్కారాల ప్రాంతాలు - గ్రామానికి సంబంధించిన పార్కు అధ్వాన స్థితుల్లో ఉన్నాయని మనసున్న పెద్ద నాయకులు మన సమస్యల మీద దృష్టి పెట్టాలని కోరుతున్నామన్నారు. రాపూరు వాసిగా రాపూరు అభివృద్ధిలో మీరు తీసుకొనే ప్రయత్నాలలో చర్యలలో నేను సహాయ సహకారాలు మనస్ఫూర్తిగా అందిస్తానని, ప్రముఖ వ్యాపార వేత్త దామిశెట్టి సురేష్ ప్రకటన లో తెలిపారు.

కుట్టుమిషన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దంపతులు

విశాలాంధ్ర - కావలి: సాధారణ సాయం కంటే ఎవరి శక్తి మీద వారు స్వతంత్రంగా జీవించేలా సేవలు అందించడం అమోఘం అని ఆ దిశగా శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకులు పొన్నగంటి మాధవి కృషి చేయడం అభినంద నీయమని స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి అన్నారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ సెంట్రల్ ఓహియా వారి సహకారం తో శ్రీసాయి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొన్నగంటి మాధవి ఆధ్వర్యంలో స్థానిక ఎవిఎస్ కళ్యాణ మండపంలో ఆదివారం 10 మందికి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, వారి సతీమణి ఆదిలక్ష్మి చేతులమీదుగా ఈ కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. మాజీ కౌన్సిలర్ అమరా యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇలాంటి సేవలను అందించడంలో ప్రతి సంస్థ ముందుకు రావాలని, ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు తమతో అనుబంధం ఉన్న సేవా సంస్థల సహకారంతో కుట్టు మిషన్లు అందచేస్తున్న మాధవి అందరికీ మార్గదర్శకులు అని అభినందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆయన సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగింది. సచివాలయాల కో ఆర్డినేటర్, పట్టణ మహిళా నేత పానుగోటి అనూరాధ మాట్లాడుతూ మాధవి అందిస్తున్న మహిళా సేవలు భవిష్యత్తులో మరిన్ని విస్తృతం కావాలని కాంక్షించారు. ఏరియా ఆసుపత్రి కమిటీ సభ్యులు డాక్టర్ మనోహర్ బాబు మాట్లాడుతూ మహిళలు మరొకరి మీద ఆధారపడకుండా గౌరవంగా జీవించేందుకు టైలరింగ్ ఎంతగానో సహకరిస్తుందని దాని పై శ్రీ సాయి ట్రస్ట్ మాధవి ప్రత్యేక దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. తాను శ్రీ సాయి ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట గత ఆరు సంవత్సరాలుగా అందిస్తున్న సేవలను సామాజిక మాధ్యమాల్లో పరిశీలించిన , కొలంబస్ లోని తెలుగు అసోసియేషన్ ఆఫ్ ఓహియా వారు ఈ సేవలు అందించే అవకాశం కల్పించారని మాధవి వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మి తో వచ్చిఈ పంపిణీ లో పాల్గొని ప్రోత్సాహం ఇవ్వడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సీతారామమ్మ, పట్టణ నేతలు మండలి కృష్ణారావు, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ధనలక్ష్మీ, మాజీ కౌన్సిలర్ సన్నిబోయిన నారాయణ పాల్గొన్నారు.

శ్రీ కామాక్షితాయి ని దర్శించుకున్న జడ్జి

విశాలాంధ్ర- నెల్లూరు: నెల్లూరు జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జి కబర్ది వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం శ్రీ వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు అతిథులకు స్వాగతం పలికి శ్రీ లక్ష్మీ గణపతి స్వామికి, మల్లికార్జున స్వామి కి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, కామాక్షితాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లనంతరం న్యాయమూర్తిని శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలు అందించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించారు.

యువ గళంలో మాలేపాటి

విశాలాంధ్ర - కావలి : నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదివారం వెంకటగిరి నియోజక వర్గంలోని పొదలకూరు మండలం తెగచర్ల గ్రామంలో 130వ రోజు కొనసాగుతున్న యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి జెన్ని రమణయ్య, కావలి పట్టణ 31వ వార్డు పార్టీ ఇంచార్జ్ మంచాల ప్రసాద్, ముఖ్య నాయకులు బత్తల రాము, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

జగన్ పాలనలో అందరికీ అభివృద్ధి: ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సమాన న్యాయం తో పాటు అభివృద్ధి చేకూరుతోందని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. 29వ డివిజన్లోని వెంకటరెడ్డి నగర్, వీఎమ్ఆర్ నగర్ లలో కార్పొరేటర్ సత్తార్ ఆధ్వర్యంలో సిసి రోడ్లకు ఎంపి ఆదాల ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో కేవలం పేదలకే సహాయం చేస్తున్నారని ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. నెల్లూరు రూరల్ పరిధిలో మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి ముందుగా 30 కోట్ల రూపాయలను సీఎం మంజూరు చేశారని, అయితే అవి సరిపోవని అడిగిన వెంటనే మరో 20 కోట్లు కూడా మంజూరు చేసి మొత్తంగా 50 కోట్ల రూపాయలు నిధులను ఇచ్చారని తెలిపారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో మిగిలిపోయిన సిసి రోడ్లు, డ్రైన్లను పూర్తి చేస్తున్నామని చెప్పారు. జగన్ పాలనలో విద్యకు వైద్యానికి ఎనలేని ప్రాధాన్యత దక్కుతోందని తెలిపారు. కేఎస్ఆర్ స్కూల్లో 600కు గాను 593 మార్కులను ఒక విద్యార్థి సాధించారంటే ప్రభుత్వ స్కూళ్లు ఎంత ముందంజలో ఉన్నాయో అర్థం అవుతుం దన్నారు. నెల్లూరు పరిధిలో అదనంగా కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా ప్రారంభించామని ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉంటే కార్పొరేటర్ సత్తార్ దృష్టికి తీసుకు రావాలని, అంతకుమించి ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, కార్పొరేటర్ సత్తార్, సాయి రెడ్డి, సూరిబాబు స్థానికులు కొందరు మాట్లా దారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మూలే విజయ భాస్కర్ రెడ్డి, వైసీపీ నేతలు కోటేశ్వర్ రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, మదన్మోహన్ రెడ్డి, హరిబాబు యాదవ్, సుబ్బారెడ్డి, రియాజ్, సలీం, మేఘనాథ్, జడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సేవా అధ్యక్షుడు సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.

రామదూత స్వామి భక్తుల రక్తదానం

విశాలాంధ్ర - కావలి: రామదూతస్వామి జన్మదినం సందర్భంగా భక్తులు ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గుడ్లూరు మండలం చేవూరు, వేణుగోపాలనగర్ లోని రామదూతస్వామి ఆశ్రమంలో నిర్వహించిన ఈ శిబిరంలో 51 మంది రక్తదానం చేసారు. ఆశ్రమ కమిటీ సభ్యులు తుర్లపాటి శ్రీనివాసరావు, కావలి రెడ్ క్రాస్ ప్రతినిధులు స్వర్ణలత, ప్రసాద్, దాకారపు రవిప్రకాష్, అన్నవరం వెంకట హనుమకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

-కేంద్ర, రాష్ట్ర విధానాలతో రైతులకు తీవ్ర నష్టం-కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: దేశ, రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధి విధానాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ పాలక వర్గాలు వాళ్ల అను కూల కార్పొరేట్ యాజమాన్యాలకు దేశ సహజ వనరులను దోచి పెడుతున్నాయని విమర్శించారు. అందుకు భిన్నంగా అహర్ని శలు కష్ట పడి ఆహార ధాన్యాలు అందిస్తున్న, రైతులకు భరోసా కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. రైతులను ఆదుకునే చర్యలు తూతూ మంత్రం గానే ఉన్నా యన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలని గతంలో నెల్లూ రు, అనకాపల్లి నుంచి జీబు జాతాలు, కృష్ణ ఎన్టీఆర్ జిల్లాల నుంచి పాదయాత్రలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్ర మాలలో రైతులు తమ వద్దకు వచ్చి సమ స్యలను విన్నవించారని తెలిపారు. ప్రత్యే కం గా వరి పండించిన రైతుకు గడ్డి మిగలడం లేదని, ఆడి చేస్తున్న రైతుకు పేడ కూడా మిగలడం లేదని రైతులు తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. అత్యంత దీనమైన స్థితిలో రైతాంగం, కౌలు రైతులు ఉన్నారని తెలిపారన్నారు. ఒకపక్క దేశానికి రైతే రాజని చెప్తున్న ప్రభుత్వాలు, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గిట్టు బాటు ధర రైతులకు అందడం లేదని, దళారు చేతుల్లోకి గిట్టుబాటు ధర వెళుతోందని ఎద్దేవా చేశారు. కౌలు రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టి, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రైతాంగాన్ని ఆదుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలైలో భారీ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ జెడి సమీక్ష సమావేశం

విశాలాంధ్ర- మనుబోలు: మనుబో లు మండలం వీరంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ జెడి శివనాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కు పలు సూచనలు సలహాలు చేశారు. ముఖ్యంగా జూలైలో పీఎం కిసాన్ పథకం గురించి ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేసుకోవాలని సూచిం చారు. రైతు భరోసా జమ కాని వారు తమ ఆధార్ లింకును బ్యాంకు అకౌంట్‌కు యాక్టివ్ చేసుకోవాలని కోరారు. అన్ని సచివాలయాల్లో రైతు భరోసా కేంద్రాల్లో పోస్ట్ ఆఫీస్ లో సంప్రదించి త్వరగా అప్లై చేసుకుంటే నగదు సమస్య రాదని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వి నియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ ఏఓ జహీర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే..: మంత్రి

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి సాహసించని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుని, కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని డైకస్ రోడ్ లో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు, ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ముఖ్యమంత్రి నెరవేర్చారని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించి సిపిఎస్ స్థానంలో జిపిఎస్ ను తీసుకు రావడం, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం వంటి మహత్తరమైన కార్యక్రమాలను చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. సుమారు పదివేలకు పైగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంలో తాను భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషాన్ని చ్చిందన్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తూ, ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్య మంత్రికి జీవి తాంతం రుణపడి ఉంటామని కాంట్రాక్టు ఉద్యోగులు చెప్పడం, ప్రభుత్వం నిర్ణయాలను ఉద్యోగుల స్వాగతించడం ఆహ్వానించదగ్గ విషయం అన్నారు. సాహసో పేతమైన నిర్ణయాలు తీసుకోవడం ఒక్క జగన్మోహన్ రెడ్డికే సాధ్యం అన్నారు. ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయడంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. కాంట్రాక్ట్ ఉద్యోగు లను రెగ్యులర్ చేస్తూ క్యాబినెట్లో ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం వారి జీవితాల్లో వెలుగులు నింపిందని, సుమారు పదివేల కుటుంబాలు ముఖ్య మంత్రిని ఎప్పటికీ మరచిపోవని ఆయన చెప్పారు. సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం కేవలం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని, ప్రధానంగా ఆర్టీసీలో పనిచేస్తున్న సుమారు 50 వేల మందిని ప్రభుత్వంలో విలీనం చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందన్నారు.24 సంవత్సరాల నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సుమారు 4వేల మంది 98 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చిన ముఖ్యమంత్రి కూడా జగన్మోహన్ రెడ్డే అని చెప్పారు. 2008 డీఎస్సీ లో క్వాలిపై అయ్యి ఉద్యోగాల కోసం ఎదురుచూ స్తున్న వారికి కూడా ఉద్యోగా లు ఇచ్చి, వారు కోరుకున్న దానికంటే అదనంగా మిని మం టైం స్కేల్ ను అమలు చేయడం, మహిళా టీచర్లకు సంబంధించి 60 రోజులు ఉన్న చైల్డ్ కేర్ లీవ్ లను 180 రోజులకు పెంచడం ఇలా ఎవరూ ఊహించని అసాధారణ నిర్ణయాలు తీసుకోవడం ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే సాధ్యమైందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి అందరి పక్షాన మరొకసారి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. తొలుత కేక్ కట్ చేసి జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ తమ ఆనందాన్ని తెలిపిన కాంట్రాక్ట్ ఉద్యోగులు మంత్రిని ఘనంగా సత్కరించి తమ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటా మని తెలుపుతూ భావోద్వేగానికి లోనయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ శర్మ, తిరుపతి జిల్లా అధ్యక్షులు సాయి కిరణ్, పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో ఆనందం నింపిన సీఎం జగన్: ఎంపీ

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: సీఎం జగన్మోహన్ రెడ్డి కాంట్రా క్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి వారి జీవితాల్లో సంతో షాన్ని నిం పారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి ప్రశంసిం చారు. రెగ్యులర్ అయిన కాంట్రాక్టు లెక్చర ర్లు ఆదివారం ఎంపీ ఆదాలను ఆయన స్వగృహంలో కలిసి సన్మా నించారు. ఒక కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ఇచ్చిన హామీని నెరవేర్చి కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపారని కొని యాడారు. భవిష్యత్తులో మీరు ఆయనకు అండగా ఉండాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి టీచర్ల సమస్యల పరిష్కారం లో చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా ఉపాధి పనులు

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: మండలంలోని వలేటి వారి పాలెం పంచాయతీలోని గాంధీనగర్ లోని ఎస్సీ ,ఎస్టీ కాలనీ వాసులు ఆదివారం జోరుగా, హుషారుగా ఉపాధి హామీ పనులు జరుగు తున్నాయి. మండల ఏ.పీ.ఓ. సమీర్ బాషా వలేటివారిపాలెం పంచాయతీ లోని గాంధీనగర్ లో ఉపాధికూలీలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఏ ఒక్క ఉపాధి హామీ కూలీ ఇతర ప్రాంతాలకు వలసపోకుండా స్థానికంగానే ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని వారికి చూచించడంతో ఉపాధిహామీ కూలీలు ఆదివారం కూడా హుషారుగా ఉపాధి పనులలో పాల్గొన్నారు . దీంతో గ్రామ పంచాయతీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనికి వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ దాసరి సింహాద్రి, సీనియర్ మేట్ దండెబోయిన కిషోర్ ఉపాధి హామీ కూలీలను పనులకు తీసుకుపోయి ప్రభుత్వం చూచించిన కొలతలు ఇచ్చి కూలీలతో పనులు చేయిస్తున్నారు. ఈ ఉపాధి పనులను ఏపీఓ సమీర్ బాషా, ఈసీ.వంశీ, టెక్నీకల్ అసిస్టెంట్ ప్రసాదు పర్యవేక్షణ చేస్తూ కొలతలు ప్రకారం పనులు చేసుకొనిప్రభుత్వం నిర్దేశించిన కూలి పొందాలని కూలీలకు అవగాహన కల్పిస్తూ కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా కృషి చేస్తున్నారు.

దక్షిణ కోస్తాంధ్రలో విస్తరిస్తున్న రుతుపవన వర్షాలు
బంగాళాఖాతంలో బలపడిన ఉపరితల ఆవర్తనం

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: నెల్లూరు తీరానికి దగ్గరలో ఉపరి తల ఆవర్తనం వలన భారీ మేఘాలు ప్రస్తు తం రాడార్ చిత్రంలో చూడగలు గలుగు తు న్నాం.

నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని తీరప్రాం తల్లో వచ్చే రెండు గంటల వరకు చినుకులు, తేలికపాటి వర్షాలు కొనసాగనుంది. నేడు బంగాళా ఖాతంలో ఏర్పడ్డ గాలు ల సంగమం దక్షిణ కోస్తాంధ్రకి దగ్గరగా వస్తుంది రాయలసీమ జిల్లాలైన అన్నమయ్య, తిరుప తి, చిత్తూ రు, కడప , నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో అక్క దక్కడ వర్షాలు, పిడుగులను చూడవచ్చు. ప్రస్తుతానికి తూర్పు రాయలసీమ జిల్లాలు, దక్షిణ కోస్తాంధ్రలో ఆకాశం పూర్తిగా మేఘావృతం అయ్యింది. కానీ రాత్రి సమయం వెళ్లేసరికి, తిరు పతి, చిత్తూరు జిల్లాల్లో నేడు వర్షాలు జోరందుకోనుంది. తమిళ నాడు సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ప్రదేశాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కానుంది.

సముద్రంలో కొట్టుకుపోయి ఇద్దరు చిన్నారులు మృతి

విశాలాంధ్ర- విడవలూరు: రామ తీర్థంలో తిరు నాళ్ల సందర్భంగా వేలాదిమంది చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారు ఆదివారం సముద్ర స్నానానికి వెళ్లడం ఆ ప్రాంత ప్రజల సంప్ర దా యం. అయితే ఆదివారం అక్కడ సము ద్ర స్నానాల్లో పార్లపల్లికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పార్లపల్లి కి చెందిన చిన్నారులు కార్తీకు (15), కళ్యాణ్(14) కుటుం బ సభ్యులతో సముద్ర స్నానానికి వచ్చారు. రామ తీర్థం తిరణా ళ్లలో ముగింపు సందర్భంగా అత్యధిక మంది జనా భా సముద్ర స్నానానికి వస్తూనే ఉంటా రు. అయితే ఈసారి ఆదివారం కావడంతో జిల్లా నలుమూలల నుండి కూడా అత్యధిక మంది ఇక్కడికి వచ్చారు. మృతి చెందిన చిన్నారుల మృతదేహాలను పోలీసులు గజ ఈతగాళ్ల చేత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనతో ఆ ప్రాంతంలోని ప్రజలందరినీ పోలీసులు సముద్రం వద్ద నుండి బయటకు పంపిస్తారు. తిరునాళ్ల సందర్భంగా ఇటువంటి ఘటన జరగడం చాలా దురదృష్టకరమని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి, చైర్మన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసి మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ద్వితీయ ఎంఈఓగా హేమ సుందర్ రావు

విశాలాంధ్ర-ముత్తుకూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా మండ లానికి ఇద్దరు ఎంఈ ఓ లను నియ మిస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి విదితమే.

అందులో భాగంగా చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడిగా పని చేస్తున్న హేమ సుందరరావును నియ మిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటికే ఒక ఎంఈఓగా మధుసూదన్ ఉన్నారు. రెండవ ఎంఈఓ గా హేమ సుందర్ రావు నియమితులు కావడంతో మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది నూతన ఎంఈఓ నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువయ్యేలా పనిచేద్దాం:ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు అందచేస్తున్న ప్రతి సంక్షేమ పథకం, అభివృద్ధి పనులు ప్రజలకు చేరువ చేసేలా పనిచేద్దామని ఆత్మకూరు నియోజకవర్గ శాసన సభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం నెల్లూరులోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించిన తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయా ధికారులు, విద్యాశాఖాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే తహశీల్దార్లకు గ్రామాల్లో జాబితాలు సిద్ధం చేసి అందించాలని తెలిపామని, ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి ఆ జాబితా తయారీ బాధ్యతగా తీసుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలు, అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు రివ్యూ సమావేశాలు నిర్వహించి అధికారులు బాధ్యతగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర వేసేందుకు అందరం నిబద్ధతతో పనిచేద్దామని వివరించారు. ఆత్మకూరు నియోజ కవర్గ కేంద్రంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 24వ తేది జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాకు హాజరయ్యే విధంగా అధికారులు చూడాలన్నారు.

ముద్దుమూడిలో మాతమ్మ తిరనాళ్లు

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు మండలం ముద్దుమూడి గ్రామంలో మాతమ్మ తిరునాళ్లు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భా గంగా శనివారం రాత్రి అమ్మవారికి పూల అలంకరణ కార్యక్రమం చేపట్టారు. కసుమూరు వర్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్, చెరుకుముడి పంచాయతీ మాజీ సర్పంచ్ చాన్ బాషా, జిలేఖా దంపతులు ప్రతి ఏటా మాత పరమేశ్వరి తిరుణాల లో భాగంగా ఆయన తమ వంతు సాయం అందించి తమ మొక్కులను తీర్చుకుంటారు. మాతమ్మ తిరుణాలతో కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో పాల్గొని తమ భక్తిని చాటుకుంటారు. మాతమ్మ ఆశీస్సులతో గ్రామస్తులు అందరూ చల్లంగా ఉండాలని కోరుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, నాగూర్ భాష ,నజీర్, జిలాని కుటుంబ సభ్యుల పాల్గొన్నారు.

మాలకొండ దేవస్థానంను దర్శించుకున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

విశాలాంధ్ర- వలేటివారిపాలెం: పవిత్ర పుణ్య క్షేత్రం మాలకొండ మాల్యాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంను ప్రకాశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, కుటుంబ సభ్యులు కందు కూరు సబ్ కలెక్టర్ శోభిక శనివారం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి కె.బి. శ్రీనివాసరావు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకున్న వారికి వేద పండితులు ఘనంగా పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ పరి సరాలను పరిశీలించారు. ఆలయంలో జరిగే వివిధ కార్యక్రమాల గురించి, దేవస్థానం వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఆలయ కార్య నిర్వాహణాధికారి కె.బి. శ్రీనివాస రావు, డీఎస్పీ రామచంద్ర, గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్ఐ బి బాలు మహేంద్ర నాయక్, ఆలయ సిబ్బంది శ్రీనివాసు లు, వెంకటేశ్వర్లు ఇరుపని నారాయణ, రాజు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో గరిమెన పెంట ఎస్టీ కాలనీ వాసులు

విశాలాంధ్ర- రాపూరు: వెంకటగిరి నియోజక వర్గం రాపూరు మండలం గరిమెన పెంట ఎస్టీకాలని వాసులు యువగళం పాదయాత్రలో ఆదివారం యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పిం చారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన గంగినేని పద్మమ్మ, మరో ముగ్గురికి సర్వే నంబర్ 75/3, 75/4, 75/5, 75/6లలో 17.20 ఎకరాలు డి.ఫారం భూ మి ఉందని, ఈ భూమిని వైసీపీ నాయకులు బొద్దు మధుసూదన్‌రెడ్డి, మరో 9 మంది ఫెన్సింగ్ రాళ్లు పగులగొట్టి కబ్జాకు ప్రయత్నిస్తున్నా రన్నారు. వ్యవసాయం చేసు కోకుండా అడ్డుపడి బెదిరి స్తున్నారని, గతంలో సర్వే నంబర్ 66/2లో 5.30 సెంట్లు, మరో 1.50 సెంట్లు భూమిని వైసీపీ నేతలు ఆక్రమించారన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి చర్యలు తీసుకోకుండా వది లేశారు. మీరు అధికారంలోకి వచ్చాక కబ్జా దారుల నుంచి మా పొలాలకు రక్షణ కల్పించాలని నారా లోకేష్‌కు వినతిపత్రం అందిం చా మని తెలిపారు. నారా లోకేష్ స్పంది స్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభు త్వంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, ఇష్టా రాజ్యంగా వైసిపి నేతలకు కబ్జాపర్వానికి తెరలేపినా పట్టిం చుకునే నాథుడే లేకుండా పోయారని, టిడిపి హయాంలో భూమి కొనుగోలు పథకం ద్వారా పేదలకు భూములు ఇవ్వడం తప్ప ఇటువంటి అరాచకాలు లేవని, తాము అధికారంలోకొచ్చాక వైసీపీ నేతలు కబ్జా చేసిన భూములను తిరిగి ఎస్సీ, ఎస్టీల కు అప్పగిస్తామని, భూ ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైయస్సార్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపికలు

విశాలాంధ్ర -మర్రిపాడు: డాక్టర్ వైఎస్సార్ క్రీడా పాఠశాల లో 4,5 తరగతుల ప్రవే శానికి ఈ నెల 20వ తేదీన మండల స్థాయి ఎంపికలు మర్రిపాడు ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి మాలకొండ రావు, మర్రిపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పద్మప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగవ తరగతిలో ప్రవేశానికి 8-9 సంవత్సరాల మధ్య ఉండి 1-8-2014 నుంచి 31-07-2015 మధ్య జన్మించిన వారు,ఐదవ తరగతి ప్రవేశానికి 9-10 సంవత్సరాల మధ్య ఉండి 1-8-2013 నుంచి 31-07-2014 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. రాష్ట్రస్థాయిలో 4వ తరగతికి 40 సీట్లు(20 బాలురుం 20 బాలికలు),ఐదవ తరగతికి 11 సీట్లు(7 బాలురు 4 బాలికలు) వున్నాయని,ఎంపికలు మండల స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి మూడు దశలలో జరుగునని పేర్కొన్నారు.ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు,స్టడీ సర్టిఫికెట్ తో హాజరు కావాలని కోరారు.ఇతర వివరములకు హరనాథ్,పి.డి,జడ్.పీ.హెచ్.ఎస్,మర్రిపాడు 9573730833 వారిని సంప్రదించాలని అన్నారు.

ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్లో ఫాదర్స్ డే

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఐఆర్‌సి ఎంఎస్ ఆర్ స్పాస్టిక్ సెంటర్, నెల్లూరులో రాయ ల్ లి యో లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు వారిచే సెక్రటరీ లియో అభినవ్, ప్రసిడెంట్ లియో వర్షిత ఆధ్వర్యంలో స్పాస్టిక్స్ సెంటర్ బాల బాలికల తల్లిదండ్రులకు సంబంధించి ఫాదర్స్ డే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తండ్రి స్థానం గురించి సమాజంలో పిల్లల క్రమశిక్షణతో కూడిన పెంపకంలో తండ్రి కృషి ఎనలేనిదని ,తల్లి తండ్రి గురువులు విలువలు పిల్లలు ఎదుగుదలకు ఉన్నత స్థితిలోకి రావడానికి మార్గ దర్శకులని ఎంసి మెంబర్ దాసరి రాజేంద్ర ప్రసాద్ ప్రిన్సిపాల్ గురునాథరావు ప్రసిడెంట్ లియో వర్షిత వ్యాఖ్యా నించారు. తండ్రులు పది మందికి సన్మానం చేసి ఈ స్పాస్టిక్ మానసిక వికలాంగులకు సంబంధించి తల్లులకు, తండ్రుల సహకారం చాలా గొప్పదని వ్యక్తులు కొనియాడారు. తండ్రుల కు తండ్రుల దినోత్సవం ఇదే ప్రథమమని వారి తండ్రి రాధా కృష్ణయ్య జ్ఞాపకార్థం తను ఈ కార్యక్రమం చేసినట్లు వర్షిత తల్లి గాయత్రి వివరించారు.

మేరునగ ధీరుడే నాన్న : మురళీమోహన్ రాజు

విశాలాంధ్ర- నెల్లూరు: ప్రతి తండ్రి తన పిల్లలకు గొప్ప హీరో కావాలని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షులు కె.మురళీమో హన్ రాజు పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నెల్లూరు బాలాజీ నగర్ లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో పితృదినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మురళీ మోహన్ రాజు మాట్లాడుతూ మనల్ని పెద్దచేసి ప్రయోజకుల్ని చేసిన వ్యక్తు లందరినీ ఈరోజున స్మరించుకుని, వారిని గౌరవించడం ఈరోజు ఉద్దేశమని వివరించారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంద సంస్థల ఐక్య వేదిక అధ్యక్షులు తమ్మినేని పాండు మాట్లాడుతూ పితృ దినోత్సవం 1910లో మొదట అమెరికాలో జరిగింది. సోనోరా అనే మహిళ తల్లిలేని తనను పెంచి పెద్ద చేసిన తండ్రి గౌరవార్థం అతని పుట్టిన రోజును పితృ దినోత్సవం నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్ర మంలో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరవ రాయప్ప, మోటివేటర్ టి. వెంకటేశ్వర్లు, విద్యార్థులు కె.లీలాక్షణ, షేక్ రహీమున్నిస, కె. మేఘన, వృద్ధులు పాల్గొన్నారు.

తాగు నీటి సరఫరా లీకై డ్రైనేజ్ వాటర్ కలుషితం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మేజర్ పంచాయతీ లో నీటి సరఫరా పైప్ లో లీకేజ్ వల్ల డ్రై పేజ్ వాటర్ కలసి కలుషిత వాటర్ కలిసి వస్తున్నాయని 7 వ వార్డులోని కొత్తపేట లో లీకేజ్ ను నిరంతర వార్డు సమస్యల ను పరిష్కరిస్తున్న విద్యా వంతురాలు,7వ వార్డు సభ్యురాలు సయ్యద్ ఆరీఫా కు స్థానికులు రిటైర్డ్ ఉద్యోగి అక్బర్ ఆరీఫా కు తెలియజెయడం. త్రాగునీటి సరఫరా లో లీకేజ్ వల్ల డ్రైనేజ్ వాటర్ కలసి అనారోగ్యానికి లోనౌవుతున్నారు.వాటర్ సరఫరా పై పులు డ్రైనేజ్ కాలువల ప్రక్కనె పోవడంతో ఆనీరు కలిసి సర ఫరా కావడం తో మురికి నీరు రావడంతో అనారోగ్య పాలవు తునైనారని పంచాయతీ అధికారులు,వాటి పై దృష్టి పెట్టి తగు ప్రజల ఆరో గ్య రక్షణ కల్పించేలా చెయా లని స్థానికులు కూడా తెలియ జెయడంతో సమస్యను పంచా యతీ అధికారులతో కలిసి త్వ రతిగతిన చేసే విధంగా చర్యలు చేపడతామని ఆరీఫా తెలిపారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ గెస్ట్ హౌస్

విశాలాంధ్ర -ఉదయగిరి: పట్టణంలోని గండిపాలెం రోడ్‌లోని గండిపాలెం జలాశయం గెస్ట్ హౌస్ శిథిలావస్థకు చేరుకొని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఆ రహదారిలోనే బ్రాందీ షాపులు ఉండడంతో మద్యం ప్రియులు షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్నారు. మద్యం షాపులు మూసిన తర్వాత కూడా ఆ ప్రాంతంలో మద్యం దొరుకుతుండడంతో రాత్రి వేళల్లో కూడా అనేకమంది గెస్ట్ హౌస్ లో మద్యం సేవిస్తుంటారు. రాత్రి వేళలో అప్పుడప్పుడు కొత్త వ్యక్తులు మహిళలతో సంచరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అ ప్రాంతంలో నివసించే ప్రజలు ఎప్పుడు ఏమి జరుగు తుందోనని హడలిపోతున్నారు. గతంలో ఈ అతిథి గృహం ఎందరో రాజకీయ నాయకులకు విడిదిగా మారి ఆతిథ్యం ఇచ్చిన గృహం ఇప్పుడు శిథిలావస్థకు చేరుకోవడంతో పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తపరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని వారు కోరుతున్నారు.

ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమావేశం



విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఆత్మకూరు నియోజక వర్గ కేంద్రంలో ఆత్మకూరు డెవలప్ మెంట్ ఫోరం, ఎంజీఆర్ ఫౌండే షన్ ద్వారా నిర్మించిన ఎంజీఆర్ మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం పూర్తయి ఈ నెల 23న ప్రారంభోత్సం జరగ నుందని, అందరం సమిష్టిగా ఈ బస్టాండ్ ప్రారంభో త్సవాన్ని విజయ వంతం చేద్దామని ఆత్మకూరు నియోజక వర్గ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు లోని మేకపాటి క్యాంపు కార్యాలయంలో బస్టాండ్ ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ప్రజా ప్రతి నిధులు, నాయ కులు, అధికారులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఆత్మకూరు నియోజక వర్గ కేంద్రంలో సర్వాంగ సుందరంగా నిర్మించాలనుకున్న మున్సిపల్ బస్టాండ్ ఆయన హఠాన్మరణంతో నిలిచిపోయిందని, తమ స్వంత నిధులతో ఎంజీఆర్ ఫౌండేషన్, ఆత్మకూరు డెవలప్ మెంట్ ఫోరం ద్వారా నిర్మించేందుకు పూనుకున్న విషయం అందరి కి తెలి సిందే అన్నారు. ఈ బస్టాండ్ ప్రారంభో త్సవానికి అన్ని ఏర్పాట్లు సమిష్టిగా చేసి నియోజకవర్గ ప్రజలకు దీన్ని అందిస్తా మన్నారు. భోజనాలు, పార్కింగ్‌కు వచ్చే ప్రజలకు, కార్యకర్తలు, అభిమానులు ఎటువంటి లోటు పాటు లేకుండా ప్రతి ఒక్కరం బాధ్యత తీసు కుందామన్నారు.

అంకమ్మ ఆలయ పునర్నిర్మాణానికి రూ.7,00,464 విరాళం



విశాలాంధ్ర -కందుకూరు రూరల్: అంకమ్మ దేవస్థానం పునర్నిర్మాణం కోసం కందుకూ రి శాసనసభ సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి, అంకమ్మ తల్లి భక్తులు కలసి పునర్నిర్మాణంను వైభవంగా నిర్మిస్తున్నారు. గుడి పూర్తి కావస్తోందని తెలిసి విరాళాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు. అందులో భాగంగా ఈరోజు శాసనసభ సభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్ ప్రముఖ కంపెనీ. కెఎంబి ప్రాజెక్ట్ లిమిటెడ్ యజమాని కనకమెడల మల్లికార్జున వరప్రసాద్ సతీమణి భానుమతి, వారి కంపెనీ తరఫున 5,00116 రూపాయలు తమ మేనేజరు కడియాల మల్లికార్జునరావు ద్వారా పంపారు. కందుకూరు వాస్తవ్యులు విపిజి జ్యువలరీ యజమాని వేముల సుకుమార్ సతీమణి విజయలక్ష్మి, కుమారుడు తిరుమల రావు కోడలు వాసవి కుమారుడు పార్ధు గుప్తా మనుమరాలు శ్రావణి కలసి అమ్మవారి పాదాల చెంత బంగారం యంత్రం కోసం 2 గ్రాముల ప్యూర్ గోల్డ్, అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణం కోసం 1,00,116 రూపాయలు నగదు రూపంలో మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో కమిటీ సభ్యులకు అందించారు. హైదరాబాద్ వాస్తవ్యులు కాళిదాస్ వెంకట రోహిణి శివకుమార్ సతీమణి మైత్రేయి అమ్మవారి దేవస్థాన పునర్నిర్మానం కోసం ఆర్‌టిజిఎస్ ద్వారా రూ. 50,116. పంపారు. హైదరాబాద్ వాస్తవ్యులు కాళిదాస్ మెహర బాబా ధర్మపత్ని మాధవి కలసి 50,116 రూపాయలు ఆర్‌టిజిఎస్ అమ్మవారి దేవస్థానం ఎకౌంటుకు పంపారు. అంకమ్మ దేవస్థానం పునర్నిర్మాణం కోసం ఇప్పటి వరకు భక్తులు 2,94,000 రూపాయలు అమ్మవారికి కానుకగా సమర్పించారు. అంకమ్మ ఆలయానికి కానుకగా సమర్పించిన ప్రతి ఒక్కరికీ తమ తరఫున, కమిటీ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యెనిమిరెడ్డి వెంకటరెడ్డి, పుట్చిశెట్టిశివ, సూరం వేణుగోపాలరావు, చెక్క వెంకట కేశవరావు, కుంభాల క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ పాఠ్య పుస్తకాలు ఉచితంగా అందించాలి



విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా లేవని ఇంటర్ బోర్డు చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నుండి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి శ్రీనివాసులు మాట్లాడుతూ ముద్రించిన పుస్త కాలను విద్యార్థుల కొనుక్కోవాలని చెప్పడం సిగ్గుచేటని గత సంవత్సరంలో కూడా పూర్తిగా పాఠ్యపుస్తకాలు ఎగనామం పెట్టిందని, పేద విద్యార్థులు చదువుకునే గవర్న మెంట్ జూనియర్ కళాశాలలో నాణ్యమైన సౌకర్యాలు కల్పించలేక పోవడం ప్రభుత్వం విఫలం అయిందని, ఉన్నత విద్యా మండలికి చెందిన రెండు వందల కోట్ల రూపాయ లను నాడు-నేడు పథకానికి దారి మళ్లించడం ఉన్నత విద్యా మండలి దెబ్బ తీసే విధంగా వున్న విద్యాశాఖ అధికారుల చర్యలు ఖండిస్తున్నామని తెలిపారు. పూర్తిగా ప్రయివేట్ ,కార్పొరేటు విద్యా సంస్థల లాగానే గవర్నమెంట్ విద్యలో విద్యను కొనుక్కునే విధంగా ప్రభుత్వ వ్యవహ రిస్తోందన్నారు. విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలను కాలేజీకి అవ సరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వమే అందించాలని ఎస్ఎఫ్ఐ నెల్లూరు జిల్లా కమిటీ నుండి డిమాండ్ చేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బాలాజీ, నరేంద్ర, సంతోష్, కిరణ్, కుమార్, పవన్ పాల్గొన్నారు.